క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



యూనిఫామ్‌లను పంపిణీ చేస్తున్న జీసీడీఓ గౌసియాబేగం

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో మెరుగైన విద్య అందించడం జరుగుతుందని జీసీడీఓ గౌసియా బేగం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆమె పరిశీలించి విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫామ్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో 6నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ విద్యను కూడా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి నారమల్ల గీత, టీచర్లు సత్యవతి, మమత, శ్యామల, జ్యోతి, స్పందన, శ్రీలక్ష్మి, సంధ్య, మంజులదేవి, అర్చన, ఉమారాణి, అశ్వత్ సుల్తానా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



ప్రింటర్‌ను అందజేస్తున్న శ్రీనివాస్ తదితరులు

జనగామ రూరల్: ఇటీవల పదో తరగతి పూర్తి చేసుకున్న పెంబర్తి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు శుక్రవారం పాఠశాలకు ప్రింటర్‌ను బహూకరించారు. కాగా, పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అంబాల స్పందనకు రూ.1,500, తాళ్లపెల్లి సౌజన్యకు 1,000 నగదు బహుమతిని దాత బైరి శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగరాణి , ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మృణాళిని, ఉమాదేవి వసంత, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం



ఎంపీడీఓకు చెక్కు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

రఘునాథపల్లి: ఖిలాషాపూర్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ (యూఎస్ఏ) సేవలు అభినందనీయమని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. సంస్థ ప్రతినిధి అతికం అమరేందర్ ప్రత్యేక చొరవతో ఖిలాషాపూర్ ప్రాథమిక పాఠశాలకు నూతన హంగులు కల్పించగా, వాటికి సంబంధించిన రూ .55 వేల చెక్కు సంస్థకు చెందిన మీసాల సురేష్, మీసాల శేఖర్ శుక్రవారం పాఠశాలలో ఎంపీడీఓకు అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ ఇదే పాఠశాలకు గతంలో కూడా రూ 1.50 లక్షలతో బెంచీలు, నీటిసౌకర్యం ఏర్పాటు చేయించడం హర్షనీయమన్నారు. పాఠశాలలో 50 మందికి పైగా విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు పొందడం పట్ల హెచ్‌ఎం, ఉపాధ్యాయులను ఎంపీడీఓ అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ రఘునందన్‌రెడ్డి, హెచ్ ఎంలు యాదవరెడ్డి, భారత రవీందర్, మాజీ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్, సరాబ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, రాజమౌళి, గడ్డం అంజన్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి

తరిగొప్పుల: వాచ్యావెంకట్‌తండా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను తహసీల్దార్ మొగుళ్ల మహిపాల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరగా మొదలు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి, బృంగి శివకుమార్, బైకని బాలరాజు, బాషా, పోషిరెడ్డి, అరుణ్‌రెడ్డి, పోషయ్య, పంచాయతీ కార్యదర్శి భూక్య లింగం పాల్గొన్నారు.

కేజీబీవీలో ‘ఇంటర్’ విద్య

- ఈ విద్యా సంవత్సరం నుంచే ఆరంభం
- ఎంఎల్‌టీ కోర్సుల్లో ప్రవేశాలు



కేజీబీవీ భవనం

కొడకండ్ల: ఎట్టకేలకు మండలకేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం ఇంటర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది. 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఇక్కడి కేజీబీవీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రారంభం అయ్యింది. 2008లో కస్తూర్బా పాఠశాల ఏర్పాటు కాగా కేజీబీవీని కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలన్న ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నేరవేరినట్లయింది. కళాశాలగా అప్‌గ్రేడ్ కావడంతో ప్రవేశాల కోసం అధ్యాపక, సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఎంఎల్‌టీ కోర్సుల్లో ప్రవేశాలు..

ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ఎంఎల్‌టీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రథమ సంవత్సరంలో 40 మంది బాలికలు విద్యనభ్యసించేలా సీట్లను మంజూరు చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉండే ఎంఎల్‌టీ కోర్సు చదువుకునే అవకాశం లభించడం ఈ ప్రాంత విద్యార్థినులకు అదృష్టంగా మారనుంది. మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిర్నితండాలోని జ్యోతిబాపూలే గురుకులంతో పాటు టీజీఆర్ఎస్‌లో ఇంటర్ విద్య అందుబాటులో ఉన్నప్పటికి కూడా ఒకేషనల్ కోర్సులు అందుబాటులో లేకపోగా కస్తూర్బాలో మాత్రమే ఎంఎల్‌టీ కోర్సు చదువుకునే అవకాశం దక్కింది. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రవేశం పొందేలా అధ్యాపకులు ప్రోత్సహిస్తున్నారు.

ఎంఎల్‌టీ చదువుకునే అవకాశం సద్వినియోగం చేసుకోవాలి



కస్తూరిబాను అప్‌గ్రేడ్ చేస్తూ ఇంటర్ విద్య అవకాశం కల్పించి ఎంఎల్‌టీ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానుంది. 40 పరిమిత సీట్లు మాత్రమే అవకాశం ఉన్నందున బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే ప్రవేశం పొందాలి. ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తూ నిరుపేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి చేయూతనిస్తున్నందున ఉద్యోగ, ఉపాధి అవకాశాలుండే ఎంఎల్‌టీ కోర్సులో తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి. ప్రభుత్వం ఉచిత వసతి, విద్యా బోధన సకల సదుపాయాలతో ఈ సంవత్సరం ఈ కోర్సును ప్రారంభించనున్నందున బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– మమత, ఎస్‌ఓ

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



నర్మెట: మల్కపేట పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



తరిగొప్పుల: అక్షరాభ్యాసం చేయిస్తున్న తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంఈఓ జానకి



కొడకండ్ల: దాత అందించిన వస్తువులు పంపిణీ చేసిన ఎంఈఓ గ్రేస్‌కేజియారాణి



పాలకుర్తి: విద్యార్థులకు పువ్వు ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

సాక్షి నెట్‌వర్క్: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈఓలు అన్నారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట, అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా చేరిన విద్యార్థులు, చిన్నారులకు స్వాగతం పలికి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా శిక్షితులైన ఉపాధ్యాయులతో ఇంగ్లిష్ మీడియంలో బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు, షూస్, స్టడీమెటీరియల్ అందించడంతో పాటు పౌష్టికాహార మధ్యాహ్నభోజనం ప్రభుత్వం అందిస్తున్నదని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకోవాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ భోజన్న

రఘునాథపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని డీఈఓ భోజన్న సూచించారు. ఖిలాషాపూర్ ఉన్నత పాఠశాలను డీఈఓ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన ఎందరో ఉన్నతులుగా ఎదగారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని మధ్యాహ్న భోజనం చేస్తూ ముచ్చటించారు. పదో తరగతి విద్యార్థులకు తరగతి గదిలో దిశానిర్దేశనం చేశారు. ఎంఈఓ రఘునందన్‌రెడ్డి, హెచ్‌ఎం డాక్టర్ భారత రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తకాలు, దుస్తులు అందాయా..?

లింగాలఘణపురం: అందరికీ పుస్తకాలు, దుస్తులు అందాయా అంటూ డీఈఓ భోజన్న విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం మండలంలోని కుందారం ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, నోటు బుక్కులు, దుస్తులు అందాయా లేదా అనే వివరాలను వారినే అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈఓ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. గత ఏడాది పదో తరతగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈసారి కూడ ఎక్కువ మార్కులతో వంద శాతం ఉత్తీర్ణత అయ్యే విధంగా మెరుగైన ఫలితాలు వచ్చే విధంగా చూడాలని హెడ్మాస్టర్ రవిశంకర్‌కు సూచించారు.

ఫలించిన రైతుల కోరిక

సాక్షి ఎఫెక్ట్..



కర్రల స్థానంలో వేసిన విద్యుత్ స్తంభం

నర్మెట: ‘కరెంటు తీగలకు కర్రలే ఆసరా’ శీర్షికన మంగళవారం కప్పుర్యాతండా గిరిజనుల కరెంటు (స్తంభాల) కష్టాలు ప్రచురితమైన విషయం విదితమే.. కాగా, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసిన అధికారులు శుక్రవారం కర్రల స్థానంలో రెండు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి తీగలను సరిచేశారు. ఏళ్ల తరబడిగా ఉన్న సమస్య తీరిందని ఈ సందర్భంగా రైతులు భూక్య మంగ్యా, భూక్య మంజీ, భూక్య నవీన్‌లు ఫోను ద్వారా సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

అటవీ వ్యవసాయంతో అధిక లాభాలు



రైతులకు మొక్కలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

స్టేషన్‌ఘన్‌పూర్: అటవీ వ్యవసాయంలో రైతులు చొరవ చూపి శ్రీగంధం, మామిడి, సీతాఫలం, వెదురు, అల్లనేరేడు తదితర వృక్ష సంపద పెంపకం చేపట్టి రైతులు అధిక లాభాలు పొందాలని అటవీవ్యవసాయ విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ చైతన్య, డాక్టర్ ఏవీ రామాంజనేయులు అన్నారు. మండలంలోని మీదికొండ గ్రామంలో రైతులకు అటవీ వ్యవసాయ పద్ధతులపై శుక్రవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడారు. రైతులు అటవీ వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని, వాతావరణ మార్పులతో కలిగే నష్టాలను అటవీ వ్యవసాయంతో తగ్గించి నేల ఆరోగ్యాన్ని పెంచి అధిక దిగుబడులను పొందవచ్చని తెలిపారు. అటవీ వ్యవసాయమంటే చెట్ల మధ్య వ్యవసాయమని, చెట్లను పెంచడంతో పాటు వాటి మధ్య ఖాళీ స్థలంలో పంటలు వేసుకోచవ్చని, పశువులను పెంచుకోవచ్చన్నారు. రైతులు చెట్లు, పంటలు, పశుసంపదను అనుసంధానం చేయడం ద్వారా సుస్థిర ఆదాయం పొందవచ్చని సూచించారు. అనంతరం షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక ఆర్థిక సహాయతో రైతులకు మామిడి, సీతాఫలం, వెదురు, నేరేడు తదితర మొక్కలు, స్ప్రేయర్లు, కొమ్మలను కత్తిరించే సెకేచర్లను రైతులకు అందించారు. కార్యక్రమంలో భువనగిరి ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.అనీల్‌కుమార్, శాస్త్రవేత్తలు రమేష్, మధుశేఖర్, రైతులు పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనపై చర్య తీసుకోవాలి

విద్యార్థి సంఘాల జేఏసీ నాయకుల డిమాండ్



ఎంఈఓ కొమురయ్యకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థిసంఘాల నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు, బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లకావత్ చిరంజీవినాయక్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ కొమురయ్యకు విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు ప్రైవేటు పాఠశాలల్లో సరైన మౌలిక సౌకర్యాలు లేవని, అర్హత లేని ఉపాధ్యాయులచే విద్యాబోధన చేయిస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో కుమ్మక్కై నిబంధనల్ని తుంగలో తొక్కుతున్నారన్నారు. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నిబంధనలు పాటించని పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎండీ.యూనస్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు యాకన్నరాథోడ్, కె.శరత్‌కుమార్, ఎం.పవన్, జయపాల్ పాల్గొన్నారు.

గిరిజన తండాల అభివృద్ధికి కృషి



గిరిజన మహిళలతో ఝాన్సీరెడ్డి

పాలకుర్తి టౌన్: గిరిజన తండాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని హత్య తండా పంచాయతీ పరిధిలోని దాసుగుడెం, లచ్చు నాయక్‌తండా, ముస్కుల్లోగూడెం గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమంలో ఝన్సీరెడ్డి పాల్గొన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, ఎండీ మదార్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో దాడి

- కుటుంబంలో ముగ్గురికి గాయాలు



దాడిలో గాయపడ్డ కిష్టయ్య



తీవ్ర రక్తస్రావంతో భాస్కర్

బచ్చన్నపేట: వ్యవసాయ బావి వద్ద బోరు విషయంలో తగదాతో పాటు మంత్రాలు చేస్తున్నారనే నెపంతో మండలంలోని కొన్నె గ్రామంలో ముగ్గురు వ్యక్తులపై కత్తితో దాడి చేసిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నె గ్రామానికి చెందిన కురాం కిష్టయ్య, నర్సింహులు అన్నదమ్ములు. వీరికి బోరు విషయంలో, మంత్రాలు చేస్తున్నారని గత కొంతకాలంగా తగాదా నడుస్తోంది. చిన్నవాడయిన నర్సింహులు, అతని భార్య అంజమ్మ, కొడుకు గణేష్‌లు రాత్రి 11 గంటలకు కిష్టయ్య ఇంటికి వచ్చి దుర్భాషలాడుతూ తలుపు తట్టారు. బయటకు వచ్చిన కిష్టయ్య, అతని భార్య యాదమ్మ, కుమారుడు భాస్కర్‌లపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కిష్టయ్య, యాదమ్మ, భాస్కర్‌లు తీవ్ర గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతున్నారు. హత్యాయత్నానికి పాల్పడిన నర్సింహులు, అంజమ్మ, గణేష్‌లపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని భాస్కర్ భార్య సుజాత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్త సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

నర్మెట: మండలకేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హెచ్ డబ్ల్యూఓ అయిల సంజీవ కోరారు. పరిసర గ్రామాల్లోని 3వ తరగతి నుంచి 10 తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ప్రవేశాలు పొందవచ్చని అన్నారు. వసతి, ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, దుప్పట్లు, ట్రంకు పెట్టె, యోగాతో పాటు క్రీడా వసతులు కల్పించడం జరుగుతుందని విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 94902 17565 సంప్రదించాలని తెలిపారు.

పశువైద్యశాలలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

రఘునాథపల్లి: పశువైద్యశాలలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి, జీవాలకు, పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గుండా వెంకటయ్య, గద్ద రాజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బానాజీపేట, ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, మాధారంలో పెంపకం దారులతో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. గ్రామ, గ్రామాన జీవాలతో పాటు ఆవులు, పాడి గేదెలు ఉన్నాయని, వాటికి సరిపడు మందులు పశువైద్యశాలలో ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాలలకు పక్కా భవనాలు నిర్మించాలన్నారు. గ్రామాల్లో వెంటనే పెంపకం దారుల సహకార సొసైటీ ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కేమిడి వీరస్వామి, గొరిగ రవి, బీరయ్య, చిరబోయిన ప్రభాకర్, గాజుల లక్ష్మయ్య, రేసు వెంకటయ్య, పయ్యావుల కిష్టయ్య, దొరగొల్ల మల్లయ్య, బంద్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

జనగామ రూరల్: ఓబుల్ కేశ్వపూర్ గ్రామంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ సందేన రవీందర్ ఆధ్వర్యంలో మండల ఇన్‌చార్జ్ నిర్మల భాస్కర్ అధ్యక్షతన శుక్రవారం ఎమ్మార్పీఎస్ గ్రామం కమిటీని ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులు తుర్కపల్లి అరుణ్ కుమార్ సమన్వయంతో గ్రామ కమిటీ వేయగా అధ్యక్షుడిగా ముస్త్యల మహేష్ మాదిగ ఎన్నిక కాగా ఉపాధ్యక్షులుగా ముస్త్యల మహర్షి, ప్రధాన కార్యదర్శులుగా గోలకొండ ప్రవీణ్, ముక్క విజయ్, కోశాధికారిగా తుర్కపల్లి శ్రవణ్ ఎన్నికయ్యారు.

రైతులు సంఘటితంగా ఉద్యమించాలి

పాలకుర్తి టౌన్: రైతులు సంఘటితంగా ఉద్యమించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అన్నారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యలయంలో ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రంను జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌కు అందజేశారు. చిట్యాల సోమయ్య, బెల్లి సంపత్, ఇంద్రరెడ్డి, నాగయ్య, మల్లేష్, సునీల్, పరశురాములు, రవి పాల్గొన్నారు.

ఘనంగా కల్కి అమ్మభవాని కల్యాణోత్సవం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో పరంజ్యోతి కల్కి అమ్మభవాని కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త జొన్నల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో వేద పండితులు పాలకుర్తి శ్యామ్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోయుక్తంగా అమ్మవారి కల్యాణం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో భక్తులు జొన్నల రాజేశ్వరరావు, శ్రీలత, జొన్నల మధుకర్ మంజుల, రవీందర్ నాగకుమారి, సోమేశ్వర్ సంగీత, సుజిత్‌కుమార్ రవళి, జిల్లా రాములు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



సరిత

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన మరిపెల్లి సరిత అనే వివాహిత కనిపించకుండా పోవడంతో శుక్రవారం సాయంత్రం తల్లి సత్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సరిత భర్త రాజ్‌కుమార్ 3 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఇద్దరు పిల్లలతో వ్యవసాయం చేసుకుంటూ ఇంటి వద్దే ఉంటోంది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పిల్లలతో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి వస్తానని చెప్పి రాత్రి వరకు రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పనులు మొదలు పెట్టాలి

చిల్పూరు: ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు మొదలు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోలేపల్లి రంజిత్‌రెడ్డి అన్నారు. మల్కాపూర్ గ్రామంలో శుక్రవారం పలువురు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ఆయన ముగ్గుపోసి ప్రారంభించారు. నాయకులు పసుల వెంకటేష్, నామాల మల్లేషం, రాజేశ్వరి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి



లింగాలఘణపురం: దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్ రవీందర్

బచ్చన్నపేట: భూ సమస్యలు ఉన్న రైతులు భూభారతి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ ఫణికిషోర్, నాయబ్ తహసీల్దార్ ప్రసవంతి సూచించారు. శుక్రవారం మండలంలోని పడమటికేశ్వాపూర్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు మాట్లాడి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎంఆర్ఐ వంశీ కృష్ణ, ఏఆర్ఐ మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

భూభారతి చట్టం రైతులకు వరం

జనగామ రూరల్: భూభారతి చట్టం రైతులకు వరంలాంటిదని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్లకొండ గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని దరఖాస్తులను స్వీకరించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహల్దార్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, ఆర్ఐ అన్వేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు బాలరాజ్, ధర్మేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగల్లులో..

జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లు గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో తహసీతల్దార్ శంకరయ్య పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 412 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌బాబు, ఆర్ఐలు దేవేందర్, బలరాంతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలఘణపురంలో ముగిసిన భూభారతి గ్రామసభలు

లింగాలఘణపురం: మండలంలో ఈ నెల 3 నుంచి ప్రారంభమైన భూభారతి గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. 13 రెవెన్యూ గ్రామాల పరిధిలో జరిగిన గ్రామ సభల్లో తహసీల్దార్ రవీందర్ ఒక బృందంగా డిప్యూటీ తహసీల్దార్ షాకీర్ మరో బృందంగా రెవెన్యూ సిబ్బంది మొత్తం పది రోజులుగా గ్రామ సభల్లోనే పాల్గొన్నారు. కాగా రైతులు తమ భూముల సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. అందులో అత్యధికంగా సాదాబైనామాలకు సంబంధించిన ధరఖాస్తులే ఉండడం గమనార్హం. మొత్తం మండలంలో ఇప్పటి వరకు జరిగిన గ్రామసభల్లో 1,510 దరఖాస్తులు రాగా అందులో మిస్సింగ్ సర్వే నంబర్లు 386, పెండింగ్ మోటే షన్స్ 188, డీఎస్ పెండింగ్ 38, విస్తీర్ణ సవరణ 109, భూమి స్వభావం 14, సక్సెషన్ 184, పీవీబీ 62, భూసేకరణ సంబంధించి 17, ఇతరములు 471 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వివరించారు. ఇంకా ఎవరైన రైతుల తమ భూములకు సంబంధించిన సమస్యలపై ఈ నెల 20 వరకు తహసీల్దార్ కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు.

నర్మెటలో..

నర్మెట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టి ఈనెల 3 నుంచి నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులు మండలంలో గురువారంతో ముగిశాయి. కాగా మండలంలో 17 గ్రామ పంచాయతీలుడంగా 8 రెవెన్యూ గ్రామాల పరిధిలో 1,148 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ కలకుంట్ల వెంకట రామానుజాచార్యులు శుక్రవారం తెలిపారు. రెవెన్యూ గ్రామాలైన బొమ్మకూర్ 29, హన్మంతాపురం 91, మల్కపేట 23, వెల్దండ 115, అమ్మాపురం 68, మచ్చుపహాడ్ 263, గండిరామారం 213, నర్మెట 346 దరఖాస్తులు అందాయని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి రికార్డులను సరిచూసుకుని రైతుల భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో డీటీ కురికాల వేణు, సీనియర్ అసిస్టెంట్ కలాటి యాదయ్య, ఎమ్మార్‌ై సింగారం సాయిబాబా, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

భూభారతి చట్టంతో సమస్యలు పరిష్కారం

దేవరుప్పుల: భూభారతి చట్టంతో అపరిష్కృత భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ ఆడెపు అండాలు సూచించారు. చౌడూరులో భూభారతి రెవెన్యూ సదస్సులో 53 మంది రైతులు పలు సమస్యలపై దరఖాస్తులు అందజేయగా స్వీకరించారు.

లింగంపల్లిలో వైద్యశిబిరం



శిబిరంలో పాల్గొన్న వైద్య బృందం

చిల్పూరు: లింగంపల్లి గ్రామంలో గ్రామ ఆర్ఎంపీ ఎలిశాల సతీష్ ఆధ్వర్యంలో హనుమకొండ ఏకశిల ఆస్పత్రి నిర్వాహకులు శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, కార్డియాటిక్, హోప్ కేర్ సెంటర్ డాక్టర్ల బృందం పలువురికి టూడిఎకో, ఈసీజీ, బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి చుక్క లింగయ్య, మాజీ సర్పంచ్ ఏదునూరి రవీందర్, కారోబార్ నర్సింహులు, వద్దుల కుమార్, మంద సిద్ధు పాల్గొన్నారు.

పాలకుర్తిలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాలి



సమావేశంలో పాల్గొన్న సమితి సభ్యులు

పాలకుర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను పాలకుర్తి మండంలో కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన సమావేశం శుక్రవారం రాత్రి మండల కేంద్రలంలోని శ్రీసోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవిరినేని సోమేశ్వర్‌రావు, గుమ్మడిరాజు సాంబయ్య మాట్లాడుతూ పాలకుర్తి మండల కేంద్రంలో కేటాయించిన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమి లేదనే సాకుతో కొందరు వ్యక్తులు కొడకండ్ల మండల కేంద్రానికి తరలించే ప్రయత్నం చేస్తూన్నారని అన్నారు. ఈ ప్రయత్నాన్ని మానుకోవాలన్నారు. గూడూరు లెనిన్, ముచ్చింతల ప్రసాద్‌రావు,దుంపల సంపత్,జంపాల రాజు, గజ్జి సంతోష్, శీల లింగయ్య,సింగారపు దీపక్, చెరుపెల్లి అశోక్, ఎడవెల్లి సోము, ఉమాకర్, యాకుబ్, ధనుంజయ పాల్గొన్నారు.